

కంటోన్మెంట్‌పై రేవంత్ ప్రత్యేక ముద్ర

- 2019 ఎన్నికల నాటి నుంచీ అనుబంధం
- పలుమార్లు బోర్డు సమావేశాలకు హాజరు
- స్థానిక సమస్యల పరిష్కారంలోనూ కృషి

కంటోన్మెంట్: రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రిగా గురువారం (నేడు) ప్రమాణ స్వీకారం చేయనున్న రేవంత్ రెడ్డికి సికింద్రాబాద్ కంటోన్మెంట్‌తో ప్రత్యేక అనుబంధం ఉంది. 2018లో ఎమ్మెల్యేగా ఓడిపోయిన అనంతరం 2019లో మల్కాజ్‌గిరి నుంచి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో ఆయన ప్రధాన ప్రత్యర్థి అయిన బీఆర్‌ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి కంటోన్మెంట్‌కు చెందిన వారు. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారం కంటోన్మెంట్ కేంద్రంగానే సాగింది. కంటోన్మెంట్ బోర్డు సమావేశానికి స్థానిక ఎంపీగా రేవంత్ రెడ్డికి ప్రత్యేక ఆహ్వానం ఉంటుంది. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి తరచూ బోర్డు సమావేశాలకు హాజరయ్యే వారు. కంటోన్మెంట్ పరిధిలో పలు సమస్యల పరిష్కారం విషయంలో సైతం ప్రత్యేక దృష్టి సారించేవారు.



కంటోన్మెంట్ బోర్డు సమావేశంలో పాల్గొన్న రేవంత్ రెడ్డి (ఫైల్)

ఐడియాలజీ సెంటర్ స్థాపనలో..

కంటోన్మెంట్ పరిధిలోని బోయిన్‌పల్లిలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ హయాంలో కాంగ్రెస్ పార్టీకి పదెకరాల స్థలాన్ని కేటాయించారు. వైఎస్ మరణానంతరం ఈ స్థలం విషయంలో ఎలాంటి ముందడుగు పడలేదు. 2021లో రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాక, ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించారు. కంటోన్మెంట్ అధికారులను కలిసి వివరాలు సేకరించారు. ఆర్మీ నుంచి భూబదలాయింపు కింద దక్కించుకున్న ఈ స్థలాన్ని ఎలాగైనా వినియోగంలోకి తేవాలన్న తలంపుతో రేవంత్ రెడ్డి కృషి చేస్తుండగా బోర్డులో నామినేటెడ్ పదవిలో ఉన్న బీజేపీ నేత రామకృష్ణ, బీఆర్‌ఎస్‌కు చెందిన దివంగత ఎమ్మెల్యే సాయన్న నుంచి సహకారం కొరవడింది. పైగా ఈ స్థలంపై కేసులున్నాయంటూ ఎమ్మెల్యే సాయన్న, పదేళ్లుగా స్థలాన్ని వినియోగించుకోలేని కారణంగా కేటాయింపు రద్దు చేయాలంటూ రామకృష్ణ బోర్డులో తమ వాదనలు వినిపించారు. దీంతో రెవెన్యూ అధికారుల ఎన్‌ఓసీ తీసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. దీంతో మరింత చాలెంజింగ్‌గా తీసుకున్న రేవంత్ రెడ్డి కాంగ్రెస్‌కు స్థలం కేటాయింపు రద్దుచేస్తే, మిగతా పార్టీలకూ అదే నిబంధన వర్తించేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేశారు. దీంతో ఏకంగా రాష్ట్ర ప్రభుత్వమే ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసి మరీ కాంగ్రెస్ పార్టీకీ స్థలం కేటాయించింది.

ఆసుపత్రి రూపురేఖలు మార్చారు...

కరోనా సమయంలో ఎంపీ రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఎక్కడికెళ్లినా రాష్ట్ర ప్రభుత్వ అధికారుల నుంచి ఆశించిన సహకారం దక్కలేదు. దీంతో కంటోన్మెంట్‌లోని జనరల్ ఆసుపత్రిపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. తన ఎంపీ నిధుల నుంచి రూ. కోటి కేటాయించడంతో పాటు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ద్వారా మరి కొన్ని నిధులు సమకూర్చారు. ఓ క్లినిక్ స్థాయిలోనే పనిచేస్తున్న కంటోన్మెంట్ జనరల్ ఆసుపత్రిని ఏకంగా జనరల్ ఆసుపత్రిగా మార్చారు. కరోనా బాధితులకు సైతం చికిత్సను అందించేలా ఆక్సిజన్ సిలిండర్లు సహా ఇతర సదుపాయాలు సమకూర్చారు.

ఫైజాన్ స్కూల్ దారి కోసం..

ఆర్మీ రోడ్ల మూసివేత, కంటోన్మెంట్‌లో తాగునీటి కొరత సహా పలు స్థానిక సమస్యలపై బోర్డు సమావేశాల్లో ప్రస్తావించి పరిష్కారం కోసం ప్రయత్నించారు. బోయిన్‌పల్లి ఒకటో వార్డు పరిధిలోని ఫైజాన్ స్కూలుకు వెళ్లే దారిని ఆర్మీ అధికారులు మూసేశారు.దీంతో రేవంత్ రెడ్డి రెండు మూడుసార్లు ఇదే విషయమై బోర్డు అధికారులను కలిసి తక్షణమే పాత రోడ్డును పునరుద్ధరించడంతో పాటు అవసరమైతే తన ఎంపీ నిధులు కేటాయించి నిర్మాణం చేపడతానని హామీ ఇచ్చారు.

మంత్రివర్గంలో బీర్ల ఐలయ్యకు చోటు కల్పించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర మంత్రివర్గంలో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు చోటు కల్పించాలని యాదవ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట యాదవ విద్యావంతుల వేదిక, గొల్ల కురుమ విద్యార్థి సంఘం, బీసీ సంక్షేమ సంఘం, బీసీ జేఏసీ, ఓయూ జాక్ తదితర సంఘాల ఆధ్వర్యంలో బీర్ల ఐలయ్యను మంత్రివర్గంలోకి తీసుకోవాలని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర నాయకులు ఊరబోయిన నర్సింహయాదవ్, ఓయూ జేఏసీ నాయకులు డాక్టర్ ఎలేందర్‌కుర్మ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 60 లక్షలకు పైగా జనాభా గల యాదవులకు కాంగ్రెస్ మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించాలని కోరారు. గత మంత్రి వర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు చోటు కల్పించిన్నట్లు కాంగ్రెస్ పార్టీ నుంచి రాష్ట్రంలో ఎన్నికైన ఏకైక యాదవ ఎమ్మెల్యే, ఉన్నత విద్యావంతుడు బీర్ల ఐలయ్యకు అవకాశం కల్పించారన్నారు.ఈ కార్యక్రమంలో జూకంటి ప్రవీణ్‌కుమార్, లక్ష్మణ్‌యాదవ్, మహేందర్, పర్వతాలు, బీరప్ప, గట్టయ్య, సైదులు, పాండు పాల్గొన్నారు.

బీసీలకు సముచిత స్థానం కల్పించాలి..

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ మంత్రి వర్గంలో బీసీ ఎమ్మెల్యేలకు సముచిత స్థానం కల్పించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో 54 శాతం గల బీసీలకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సరైన సంఖ్యలో అవకాశాలు కల్పించకుండా అన్యాయం చేసినందునే కాంగ్రెస్ పార్టీ విజయానికి బీసీలు కృషి చేశారని తెలిపారు. బీసీ డిక్లరేషన్‌ను అమలు చేసి కుల గణను చేపట్టాలన్నారు. బీసీల ఆకాంక్షలకు అనుకూలంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేసి సరైన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధులు

అడ్డగుట్ట: మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని యాక్షన్ ఎయిడ్ సంస్థ ప్రతినిధులు డిమాండ్ చేశారు. మహిళలు, యువతులపై జరుగుతున్న అత్యాచారాలపై బుధవారం అడ్డగుట్ట, తుకారాంగేట్ ప్రాంతాల్లో యాక్షన్ ఎయిడ్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆడపిల్లలకు సేఫ్ అండ్ అన్‌సేఫ్ టచ్ అంశాలపై తల్లిదండ్రులు చిన్నప్పటి నుంచే అవగాహన కల్పించాలని సూచించారు. విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు 1098, 181 నంబర్‌లను సంప్రదించాలన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ నెల 4 నుంచి 9వ తేదీ వరకు జరగనున్న వేడుకల్లో భాగంగా బుధవారం ఉదయం స్వామివారికి 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. అలంకరణ, హోమం అనంతరం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి సీతారాముల కల్యాణాన్ని తిలకించి పులకించిపోయారు. అనంతరం సుందరకాండ పారాయణం, హోమం, పుష్పయాగం కనుల పండువగా జరిగాయి.

శ్రీవారి ఆలయ హుండీ ఆదాయం రూ. 7,11,153

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు బుధవారం చేపట్టారు. ఆలయ ఈవో ఎస్. లావణ్య, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి, ట్రస్ట్ బోర్డు సభ్యుడు నవీన్ కుమార్ పటేల్ లెక్కింపు పరిశీలించారు. ఈ సందర్భంగా హుండీ ఆదాయం రూ. 7,11,153 లక్షలు వచ్చినట్లు ఈవో లావణ్య తెలిపారు. హుండీ లెక్కింపు ఆఖరిసారిగా గత సెప్టెంబర్ 12న చేపట్టామన్నారు. వెంకటేశ్వర స్వామి దేవస్థానంతో పాటు శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి, ఇతర ఉప ఆలయాలకు సంబంధించి హుండీలు లెక్కించామని ఆమె వివరించారు.

శ్రీనగర్ కాలనీలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

బంజారాహిల్స్: శ్రీనగర్ కాలనీ ప్రధాన రహదారిలోని ఎస్‌ఆర్ క్లబ్ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. సుదర్శన్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ ధోత్రే, సర్కిల్–18 డీఎంసీ ప్రశాంతికి ఫిర్యాదు చేశారు. జీహెచ్‌ఎంసీ అనుమతులకు విరుద్ధంగా ఈ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇప్పటికే తాము ఈవీడీఎం డైరెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు. నోటీసులు కూడా జారీ చేశారన్నారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 టౌన్‌ప్లానింగ్ అధికారులు ఈ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆరోపించారు. 15 రోజుల క్రితం తాము ఎస్‌ఆర్ క్లబ్ అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేయగా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని ఆయన ఆరోపించారు.

కేసీఆర్‌ను గద్దె దించేందుకు ఉద్యమకారుల కృషి అమోఘం

అడ్డగుట్ట: కేసీఆర్ పాలనను అంతం చేయడానికి తెలంగాణ వ్యాప్తంగా ఉద్యమకారులు చేసిన కృషికి అమోఘమని తెలంగాణ ఉద్యమకారుల సమితి చైర్మన్ ఎస్. యాదగిరి పేర్కొన్నారు. బుధవారం అడ్డగుట్ట ఫౌండర్స్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఉద్యమకారుల సమితి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దొరల గడీ, కుటుంబ పాలనను కూల్చడానికి నిరంతరం పోరాడిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపరిచిన అన్ని అంశాలు, ఆరు గ్యారంటీలను అమలు పరిచి బీఆర్‌ఎస్ జరిపే దుష్ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. కేసీఆర్ తన హయాంలో పట్టించుకోని ఉద్యమకారులు, అమరుల కుటుంబాలను అక్కున చేర్చుకొని వారి సమస్యలను పరిష్కరించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించాలని కోరారు. నేడు ఎల్‌బీ స్టేడియంలో జరిగే రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారానికి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రఫుల్ రామ్‌రెడ్డి, కేసీఎస్. ప్రసాద్, పద్మజ, హరికృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యాదగిరి

బీసీ ఉద్యోగులకు శుభపరిణామం

పంజగుట్ట: తెలంగాణ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రశేఖర్ గౌడ్ ఆయకు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారంలోకి రావడం తెలంగాణ బీసీ ఉద్యోగులకు శుభపరిణామమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు స్నేహపూర్వకంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులు పడ్డబాధలు వర్ణనాతీతమని అలాంటి నిరంకుశ ప్రభుత్వం పోయి ప్రజాస్వామ్య కాంగ్రెస్ ప్రభుత్వం రావడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగులందరూ సంతోషంగా ఉంటారని ఆశాభావంవ్యక్తం చేశారు. ఉద్యోగులకు బకాయిపడ్డ డీఏలు, పీఆర్‌సీని కొత్త ప్రభుత్వం వెంటనే విడుదల చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించి క్రిమీలేయర్ పరిమితిని పెంచాలని వారు కోరారు. సమావేశంలో సంఘం మహిళా అధ్యక్షురాలు రమ, ఉపాధ్యక్షులు సాయికిరణ్ గౌడ్, వంశీధర్, చక్రధర్, శమీమ్, రామరాజు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

అడ్డగుట్ట: రైలు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 5న రాత్రి 11.30 గంటల సమయంలో సుమారు 45–50 ఏళ్ల మధ్య వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి సికింద్రాబాద్ స్టేషన్‌లో రైలెక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడ్డాడు. ప్లాట్‌ఫాం మధ్యలో ఇరుక్కుని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే రైల్వే పోలీసులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

కమ్యూనిటీ హాల్‌లో వసతులు కల్పించాలి

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్ కట్టంబాయిలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో కనీస వసతులు కల్పించాలని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే ముఠా గోపాల్ తనయుడు ముఠా జైసింహాకు వినతిపత్రాన్ని సమర్పించారు. స్థానికంగా నిరంతరం డ్రైనేజీ లీక్ అవుతోందని దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే డ్రైనేజీకి మరమ్మతులు చేపట్టాలని కోరారు. కమ్యూనిటీ హాల్‌లో వాచ్‌మెన్ రూమ్, కిచెన్ కోసం ప్రత్యేక గది, ప్లంబర్ పనులు, ఓవర్ హెడ్ ట్యాంకులు రెండు ఏర్పాటు కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు.

దంత సంరక్షణతో పరిపూర్ణ ఆరోగ్యం

ముషీరాబాద్: దంత సంరక్షణతోనే పరిపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని గాంధీ ఆస్పత్రి రిటైర్డ్ డెంటల్ సర్జన్ డాక్టర్ ఒ.నాగేశ్వర్‌రావు అన్నారు. బుధవారం భోలక్‌పూర్‌లోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో డాక్టర్ రావుస్ ఓరల్ హెల్త్ ఫౌండేషన్, డాక్టర్ నాగేశ్వర్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో బాలికలకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. దంతాలను ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలని ఆయన సూచించారు. దంతాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. దంత సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో పిల్లలకు భోజనాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దంత వైద్యులు డాక్టర్ అశోక్‌కుమార్, బోగరాజు, కె.దేవరాజ్, హాస్టల్ వార్డెన్ భానుప్రియ తదితరులు పాల్గొన్నారు.



ఐడీహెచ్ కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన మర్రి శశిధర్‌రెడ్డి



అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కోట నీలిమ



రసూల్‌పురాలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే లాస్యనందిత

స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్

భారత రాజ్యాంగ నిర్మాత డా. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లోని ఆయన విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల హక్కుల కోసం జీవితాంతం రాజీలేని పోరాటం చేసిన గొప్ప మహనీయుడు అంబేద్కర్ అని దళిత వర్గాలు విద్యా, ఆర్థిక, సామాజిక, రాజకీయపరంగా అభివృద్ధి చెందాలని ఎంతో శ్రమించారన్నారు. అంబేద్కర్ ఆశయాలు, ఆదర్శాలను ఆచరణలో సాఫల్యం చేసినప్పుడే ఆ మహనీయుడికి మనమందించే నిజమైన నివాళి అన్నారు. ప్రస్తుత సమాజానికి అంబేద్కర్ స్ఫూర్తి ఎంతో అవసరమన్నారు.

–సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం



నివాళి అర్పిస్తున్న పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు



అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ



బేగంపేటలో నివాళి అర్పించిన కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ సామల హేమ



బోయిన్‌పల్లి చౌరస్తాలో..



లాలాపేటలో..



అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న బీజేపీ సీనియర్ నేత మర్రి పురురవారెడ్డి



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి



అంబేద్కర్ విగ్రహానికి పూల వేస్తున్న ప్రొ.గాలి వినోద్‌కుమార్



కంటోన్మెంట్ వర్క్‌షాపు వద్ద..



బేగంపేట-బల్కంపేట లింక్‌రోడ్డులో..




వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న సదా కేశవరెడ్డి




నివాళి అర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నియోజకవర్గ వాసులకు రుణపడి ఉంటా



ఈఓ అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తలసానికి శుభాకాంక్షలు తెలుపుతున్న జెక్‌కాలనీ మహిళలు



తలసానిని సన్మానిస్తున్న సంఘం నాయకులు

సనత్‌నగర్: నియోజకవర్గ ప్రజలు తనపై చూపిస్తున్న ప్రేమాభిమానాలను ఎన్నటికీ మరువబోనని సనత్‌నగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. భారీ మెజార్టీతో మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఆయన నివాసంలో బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, పలు కాలనీలు, బస్తీలకు చెందిన ప్రజలు సన్మానించారు. సనత్‌నగర్‌లోని సెవన్ టెంపుల్స్, సికింద్రాబాద్‌లోని గణేష్ టెంపుల్, పీజీ రోడ్డులోని హనుమాన్ టెంపుల్‌కు చెందిన కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ పండితులు శ్రీనివాస్‌యాదవ్‌ను ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈఓ అన్నపూర్ణ ఆధ్వర్యంలో జెక్‌కాలనీకి చెందిన మహిళలు భాగ్యలత, కృష్ణకుమారి, హరిత, సుమ, భారతి, శ్రీదేవి తదితరులు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తనను భారీ మెజార్టీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని ఎలాంటి అవసరం వచ్చినా అన్నివేళలా అందుబాటులో ఉంటానన్నారు. వాటర్‌వర్క్స్ సీజీఎం ప్రభు, జీఎం హరిశంకర్, డీజీఎం శశాంక్, జీహెచ్‌ఎంసీ ఈఈ సుదర్శన్, డిప్యూటీ ఈఈ ఆంజనేయులు, నవీన్, ఎస్‌ఆర్‌నగర్ సీఐ రాంప్రసాద్, బల్కంపేట ఎల్లమ్మ ఆలయ కమిటీ సభ్యులు బండారి సుబ్బారావు, టిల్లు, కొలను బాల్‌రెడ్డి, సుభాష్‌నగర్ అధ్యక్షుడు బాల్‌రాజ్, సికింద్రాబాద్ గణేష్ టెంపుల్ చైర్మన్ సత్యనారాయణ, సభ్యులు జయరాజ్, హన్మంతరావు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.

- **లాలాపేట:** సనత్‌నగర్ ఎమ్మెల్యేగా అధిక మెజార్టీతో గెలుపొందిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ఆయన నివాసంలో బుధవారం తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము అశోక్‌యాదవ్, రాష్ట్ర కార్యదర్శి అక్కల మధుకర్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.